క్లుప్తంగా

ఆలయ స్థలాన్ని కాపాడాలని ఆందోళన



ఆలయానికి చెందిన స్థలాన్ని కాపాడాలని కోరుతూ నిరసన వ్యక్తం చేస్తున్న యువత

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస గ్రామదేవత బంగారమ్మ ఆలయానికి చెందిన స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ స్థానిక యువత ఆదివారం ఆందోళన చేపట్టారు. ఆక్రమణ దారులకు కొంతమంది స్థానిక నాయకులు, మాజీ ఉక్కు ఉద్యోగులు కొమ్ముకాయడం సరికాదని ఆరోపించారు. ఈ సందర్భంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ యువత పుచ్చా మణిబాబు, మాదాసు రామకృష్ణ, పాముల వసంతరావు, మాదాసు గణేష్, బలిరెడ్డి వాసు, నీలపాటి రాజు, ఆకుల జనార్దన్, బలిరెడ్డి అప్పారావు, లుకలాపు లోకేష్ పాల్గొన్నారు.

ప్రమాదకర స్తంభం తొలగించారు

సాక్షి ఎఫెక్ట్..



అధికారులు తొలగించిన స్తంభం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు దిబ్బపాలెంలో తుప్పుపట్టి కూలిపోడానికి సిద్ధంగా ఉన్న హైమాస్ట్ స్తంభాన్ని అధికారులు తొలగించారు. కూలిపోడానికి సిద్ధంగా ఉన్న హైమాస్ట్ లైట్ స్తంభంపై ఈనెల 7వ తేదీన వార్త వెలువడింది. స్పందించిన జీవీఎంసీ విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే వాటిని తొలగించి పక్కన పెట్టారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

సాయినాథుడి ఆలయంలో ప్రత్యేక పూజలు



గాజుల అలంకరణలో షిర్డీసాయిబాబా

పెదగంట్యాడ: షిర్డీసాయిబాబా 106వ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా సమతానగర్‌లోని షిర్డీ సాయి శాంతిధామంలో సాయినాథుడిని గాజులతో అలంకరించారు. 9999 గాజులతో బాబాను అలంకరించినట్టు ఆలయ కమిటీ చైర్మన్ సత్యంబాబు, కార్యదర్శి రవి శంకర్ తెలిపారు. విజయదశమి రోజున బాబా సమాధి అయిన సందర్భంగా అభిషేకాలు,అర్చనలు చేశారు.మౌన స్మరణ, పుష్పాభిషేకం భక్తులతో చేయించారు.

శిల్పారామంలో ముగిసిన సంబరాలు



శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో కళాకారులు

పీఎం పాలెం: శిల్పారామంలో కొద్ది రోజులుగా జరుగుతున్న దసరా సంబరాలు శనివారంతో ముగిశాయి. ముగింపు ఉత్సవాలలో భాగంగా ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను అలరించింది. నగరానికి చెందిన నృత్యభారతి డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు అద్భుతంగా శాస్త్రీయ నృత్యం ప్రదర్శించి, ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కనక మహాలక్ష్మి నృత్య దర్శకత్వంలో కళాకారులు లీలాప్రియ, వేదశ్రీ, నవ్యశ్రీ, సావిత్రి, కుష్మిత తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులకు గ్రహణం!

రహదారి విస్తరణ పనులు పడకేశాయి. కల్వర్టుల నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేయడంతోలక్ష్యం నెరవేరలేదు. మూడు కిలోమీటర్ల నిడివిలో విస్తరించిన రహదారి అక్కరకు రానిదిగా మిగిలిపోయింది. పాలకులు దృష్టిపడితే ప్రజలు హాయిగా ప్రయాణం సాగించవచ్చు.

- రూ.7.75 కోట్లతో రహదారి విస్తరణ పనులు
- రహదారి నిర్మాణం పూర్తయినా ప్రయోజనం శూన్యం
- పాలకులు పట్టించుకోక పోవడంతో తప్పని పాట్లు



కొత్తూరు, వెదుళ్లనరవ కాలనీల వద్ద కల్వర్టులు నిర్మించకపోవడంతో ఇరుగ్గా ఉన్న రహదారి



నంగినారపాడు కాలనీ వద్ద రోడ్డు దుస్థితి



వెదుళ్లనరవ గ్రామం శివారులో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు దువ్వాడ సెక్టార్–1 నుంచి నంగినారపాడు (అజనగిరి) హైస్కూల్ వరకు మూడు కిలోమీటర్ల నిడివిగల రహదారి విస్తరణ పనులు 8 నెలల కిందట చేపట్టారు. రూ.7.75 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు ప్రారంభించారు. రహదారి విస్తరణ పనులు పూర్తి చేశారు. పది చోట్ల కల్వర్టులు నిర్మించాల్సి ఉండగా రెండు చోట్ల కల్వర్టులపై శ్లాబులు వేసి విస్తరించారు. ఇంతలో ఎన్నికలు రావడంతో పనులకు బ్రేక్ పడింది.

కొత్త ప్రభుత్వం వచ్చినా...

ఎన్నికలు ముగిసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పాలకులు పెండింగ్ పనులపై దృష్టి పెట్టలేదు. గ్రావెల్ పోగులు ఎక్కడికక్కడే వదిలేయడం, కల్వర్టుల వద్ద గ్రావెల్ పూడ్చి బీటీ రోడ్డు వేయాల్సి ఉండగా మధ్యలోనే వదిలేశారు. మిగిలిన 8 చోట్ల కల్వర్టుల నిర్మాణం నిలిచిపోయాయి. కల్వర్టులకు రెండువైపులా రహదారి కుదించుకుపోయి పూర్తిగా ధ్వంసమైంది.

రాకపోకలకు అవస్థలు

రోడ్డు విస్తరించినా కల్వర్టు పనులు చేపట్టకపోవడం వల్ల ఉపయోగం లేకుండా పోయిందని స్థానికులు, ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి వంద రోజులు దాటినా పట్టించుకోలేదని ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్యం ఇదీ

గాజువాక, సబ్బవరం మండలాల మధ్య అనుసంధానంగా ఉన్న గ్రామాల ప్రజల కోసం ఈ రహదారి విస్తరణ పనులను గత ప్రభుత్వం చేపట్టింది. నిత్యం వేలాది మంది, వందలాది వాహనాలు రాకపోకలు సాగించే మార్గం రద్దీగా ఉండడంతో పాటు మలుపులు ఎక్కువగా ఉండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకొనేవి. దీంతో గత ప్రభుత్వం స్పందించి జీవీఎంసీ నిధులతో విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. అయితే కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభమయ్యేటప్పటికే ఎన్నికల షెడ్యూల్ రావడంతో నిర్మాణ పనులు నిలిపేశారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పనులపై దృష్టిపెట్టలేదు.

కల్వర్టులు పూర్తి చేయాలి



కల్వర్టు పనులు చేపట్టక పోవడం వల్ల రహ దారి విస్తరించినా పెద్దగా ఉపయోగం లేకుండాపోయింది. కల్వర్టుల వద్ద ఇరుకుగా ఉండడంతో వాహనాలు నిలిచిపోతున్నాయి. కల్వర్టుల వద్ద రహదారి గోతులతో నిండిపోయింది. దీంతో వాహనదారులకు ఇబ్బందిగా ఉంది. స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్లు స్పందించి కల్వర్టుల నిర్మాణం చేయాలి.

–చట్టి అప్పలరాజు, వెదుళ్లనరవ

అసంపూర్తి పనులతో అవస్థలు



రోడ్డు వెడల్పు చేశారు. మార్గం విశాలంగా ఉందని భావిస్తున్నా కల్వర్టుల వద్ద వాహనాల రాకపోలకు ఇబ్బందికరంగా మారింది. అలాగే రెండు చోట్ల కల్వర్టులు నిర్మించినా మట్టి పోగులు వదిలేయడంతో వాహనచోదకులు అగచాట్లు పడాల్సి వస్తుంది. జీవీఎంసీ కమిషనర్, పాలకులు పట్టించుకొని అసంపూర్తి పనులు పూర్తి చేసేలా చూడాలి.

–ఎస్.బొరయ్యనాయుడు, వెదుళ్లనరవ కాలనీ

ఉదాసీనంగా వ్యవహరిస్తే రాష్ట్రానికే ముప్పు



దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మిక సంఘ నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగార పరిరక్షణ విషయంలో కూటమి ప్రభుత్వ పెద్దలు ఉదాసీనంగా వ్యవహరిస్తే రాష్ట్రం భారీగా నష్టపోతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో 1340వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. రాష్ట్రానికి ఆయువు పట్టువంటి విశాఖ ఉక్కును అమ్మేస్తే రాష్ట్రానికి వెన్నెముక విరిగినట్టే అన్నారు. దసరా పండగకు బోనస్ చెల్లించాల్సిన యాజమాన్యం కనీసం జీతాలు కూడా చెల్లించకుండా మానసికంగా వేధిస్తోందన్నారు. దేశంలో అన్ని ప్రభుత్వరంగ సంస్థల్లో బోనస్ చెల్లిస్తే, ఇక్కడ మాత్రం జీతం కూడా చెల్లించకుండా కావాలనే కార్మికులను, వారి కుటుంబ సభ్యులను ఇబ్బంది పెడుతుందని ఆరోపించారు.కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉక్కు పరిరక్షణకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకలు కామేశ్వరరావు, డేవిడ్, విళ్లా రామ్మోహన్‌కుమార్, బాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ వేడుకల్లో తెలంగాణ మహిళలు



వేడుకల్లో పాల్గొన్న సీజీఎం శ్రీధర్, జీఎంలు

ఉక్కునగరం: తెలంగాణకు చెందిన ఉక్కు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు బతుకమ్మ సంబరాలను అట్టహాసంగా నిర్వహించారు. దసరా సందర్భంగా జరిగిన సంబరాల్లో తెలంగాణ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా గడిపారు. మహిళలు, పిల్లలు ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్. కుమారస్వామి, జి. ఆనంద్ మాట్లాడుతూ ఏటా బతుకమ్మ సంబరాలు జరుపుతున్నామన్నారు. సద్దుల బతుకమ్మతో సంబరాలు ముగిశాయన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్, జనరల్ మేనేజర్లు రవశేఖర్, డాక్టర్ ఎ.పి. నవీన్‌కుమార్, ఎస్. వీరేశం, ఆచారి, ఎ. మురళీధరరెడ్డి, కె.వి.డి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వచ్ఛభారత్



ప్లాట్‌ఫారాలపైకి పెరిగిన చెట్లను తొలగిస్తున్న సేవకులు



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ ప్రజా సంఘాల నాయకులు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణలో ప్రజా సంఘాల నాయకులు స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. ప్లాట్‌ఫారాల ఆవరణలోని పిచ్చిమొక్కలు, చెత్తా చెదారం తొలగించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్, ఉక్కునగరం సత్యసాయి సేవాసమితి, మానవ వికాస వేదిక, గాజువాక, స్టీల్‌సిటీ, కూర్మన్నపాలెం లయన్స్‌క్లబ్, స్పందన చేయూత ఫౌండేషన్, ప్రజా సంఘాల ప్రతినిధులు ఎం.శ్రీనివాసరావు, రవికిరణ్, చంద్రశేఖర్, సురేష్, కె.ఈశ్వర్, వి.జాషువ, ఎస్.రామకృష్ణ, వీర్రాజు, కామేశ్వరరావు, ఎం.ఎస్.ఎన్.మూర్తి, ఎ.శ్రీనివాసరావు, కనక మహాలక్ష్మి, కోటేశ్వరరావు, మస్తాన్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

స.హ.చట్టానికి పాలకుల తూట్లు



మాట్లాడుతున్న రామ అప్పారావు

అగనంపూడి: సమాచార హక్కు చట్టం ద్వారా అవినీతి రహిత సమాజాన్ని నిర్మించవచ్చని చేసిన చట్టానికి నేటి పాలకులు తూట్లు పొడుస్తున్నారని సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు ఆరోపించారు. సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిన తేదీని పురస్కరించుకొని అగనంపూడి సీడబ్ల్యూసీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ అవినీతి బయట పడుతుందనే భయంతో కొంతమంది ప్రజా ప్రతినిధులు, బ్యూరోక్రాట్లు కలిసి చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కొన్నేళ్లుగా కృషి చేస్తూ సఫలం అయ్యే స్థితికి తీసుకువెళ్లారన్నారు. ఈ విషయంలో న్యాయ వ్యవస్థ కలుగజేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది కొల్లి సత్యారావు, అగనంపూడి హార్టికల్చర్ సొసైటీ అధ్యక్షుడు నెల్లి శ్రీనివాసరావు, సీడబ్ల్యూసీ మాజీ కార్యదర్శి వంకర రాము, కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకుడు బలిరెడ్డి శ్రీను, దానబాల త్రిమూర్తులు, దానబాల పైడికొండ, నెల్లి శ్రీను పాల్గొన్నారు.

విరాళాల అందజేత



శ్రీవారి అన్నదాన నిధికి రూ.50 వేల చెక్కు అందజేస్తున్న రాజేంద్రప్రసాద్, లక్ష్మి దంపతులు



రూ.1.75 లక్షల చెక్కును ట్రస్ట్ ప్రతినిధులకు అందజేస్తున్న శ్రీనివాస్, సుభాషిణి దంపతులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి శనివారం వెంకటేశ్వరకాలనీ, షీలానగర్‌కు చెందిన బందారు శ్రీనివాస్, సుభాషిణి దంపతులు శ్రీవారికి వెండి వరదహస్తం నిమిత్తం రూ.1,75,000 చెక్కు అందజేశారు.

శ్రీవారి అన్నదాన మూల నిధికి....

శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం అన్నదాన మూల నిధికి వెంకటేశ్వరకాలనీ, షీలానగర్‌కు చెందిన కనకమేడల వెంకట నాగసాయి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన తల్లిదండ్రులు కనకమేడల రాజేంద్రప్రసాద్, లక్ష్మి దంపతులు రూ.50 వేల చెక్కు అందజేశారు.

ఘనంగా పూజలు

శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ఆదివారం శ్రవణా నక్షత్ర యుక్త శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం శమీ పూజ చేశారు.

ఘనంగా విజయదశమి పూజలు



అగనంపూడి సాయిబాబా ఆలయంలో భక్తులు



యారాడలో భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి



నెమలి పింఛాలతో రాజరాజేశ్వరి



పెదమడకలో రాజరాజేశ్వరిగా..



కానుకలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, యూనియన్ నాయకులు



డ్రైవర్స్‌కాలనీలో విశేష అలంకరణలో దుర్గమ్మ



ఎల్వీనగర్‌లో దుర్గామాత



ఉక్కు త్రిశక్తి ఆలయంలో నవ చండీ యాగం



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

గాజువాక: గాజువాక ప్రాంతంలో విజయదశమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో మహిళలు సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, యాగాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం విజయదుర్గకు అభిషేకాలు జరిపించారు. 70వ వార్డు ఎల్వీ నగర్ కనకదుర్గ ఆలయంలో, డ్రైవర్స్ కాలనీ కనకదుర్గ ఆలయంలో విశేష పూజలను నిర్వహించి ప్రసాద వితరణ చేశారు.

అగనంపూడి: దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా 85వ వార్డు అగనంపూడి కూడలిలోని దుర్గాలమ్మ ఆలయంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. పదో రోజు అమ్మవారిని నెమలి పింఛాలతో అలంకరించి రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. శ్రీ బొర్రమాంబ పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో లలిత, విష్ణు సహస్ర పారాయణం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా కనకరాజు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

- పెదమడకలోని మాతా దుర్గా భవానీ ఆలయంలో దుర్గాదేవి రాజరాజేశ్వరి దేవి అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి అభిషేకాలు, లలిత సహస్రనామాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు బళ్ల పైడిరాజు, కరణం లక్ష్మీ దంపతులు ఏర్పాట్లు చేశారు.

జమ్మి చెట్టుకు పూజలు

అగనంపూడి షిర్డీసాయి మందిరంలో బాబా సమాధి వేళలో ఓం సాయి.. శ్రీ సాయి నామ జపం నిర్వహించారు. తదుపరి జమ్మి చెట్టు పూజ చేసి శమీ మంత్రాన్ని పఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొయ్య వెంకట రమణారెడ్డి, వ్యాసశర్మ, శంభుడు, నవీన్, జానకీ టీచర్, సత్యలక్ష్మి, సత్యశ్రీదేవి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిసాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధానఅర్చకుడు ఫణిశర్మ ఆధ్వర్యంలో అమ్మవార్లకు వేకువజామున ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, యాగ దీక్షాధారణ అనంతరం అమ్మవార్లకు నవరసాభిషేకాలు జరిపారు. ఆలయ ఆవరణలో వాహన పూజలు చేశారు. సాయంత్రం రుత్వికుల ఆధ్వర్యంలో నవచండీ యాగ మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం జమ్మిపూజ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా అన్న సమారాధనల

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దయాల్‌నగర్ టీబీసీ పాయింట్ వద్ద గణేష్ సాయి సంతోష్ యూత్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో గాజువాక వర్తక సంఘం గౌరవాధ్యక్షుడు తిప్పల నితీష్‌రెడ్డి, ఎస్వై నాయుడు, దుర్గారెడ్డి, తిరుపతి, నర్సీపట్నం నాయుడు, రవి పాల్గొన్నారు.

- జీవీఎంసీ 64వ వార్డు యారాడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన అన్నసమారాధనను వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి ప్రారంభించారు. వందలాది మంది అన్న ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా దసరా సంబరాలు

పెదగంట్యాడ: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) గాజువాక శాఖ ఆధ్వర్యంలో స్థానిక వికాస్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో దసరా సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథులుగా 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ అధ్యక్షుడు ఎంఆర్ఎన్ వర్మ, మల్కాపురం సీఐ విద్యాసాగర్, గాజువాక సీఐ శ్రీనివాస్ హాజరై విలేకరులకు దసరా కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే విశాఖ జిల్లా అధ్యక్షుడు కాకి రాము, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రావణుడిపై రాముడి గెలుపే విజయదశమి

- హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి అంబరీష దాస
- వైకుంఠ మందిర ప్రాంగణంలో 'రావణ దహన'



బాణసంచాతో రావణవధ



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

తగరపువలస: త్రేతాయుగమున దశానన రావణునిపై శ్రీరామచంద్రుని విజయానికి సంకేతంగా విజయదశమి జరుపుకొంటారని హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి అంబరీష దాస అన్నారు. ఇందుకు ప్రతీకగా ఉత్తరాది రాష్ట్రాలలో విజయదశమి నాడు 'రావణ వధ' నిర్వహిస్తారన్నారు. ఉత్తరాది రాష్ట్రాలలో వైభవంగా జరుపుకొనే ఈ ఉత్సవాన్ని మొదటిసారి విశాఖలో నిర్వహిస్తున్నామన్నారు. ఆనందపురం మండలం గంభీరం హరేకృష్ణ వైకుంఠ మందిర ప్రాంగణంలో విజయదశమి సందర్భంగా శనివారం సాయంత్రం హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో 'రావణ వధ' నిర్వహించారు. ఈ సందర్భంగా 20 అడుగుల ఎత్తు కలిగిన రావణుడి భారీ కటౌట్‌ను ప్రత్యేక బాణసంచాతో దహనం చేశారు. అంబరీష దాస మాట్లాడుతూ చెడుపై మంచి గెలుపే విజయదశమి అన్నారు. అంతకు ముందు నిష్కించిన భక్తదాసచే శ్రీరామ అష్టోత్తర హోమం, శ్రీరామలీలా ప్రవచనం, మహా మంగళహారతి నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మాంసాహార దుకాణాలు కిటకిట



సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా వినియోగదారులతో రద్దీగా మాంసం దుకాణం

సీతమ్మధార : దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలు పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుపుకున్నారు. పండగ శనివారం అయినప్పటికీ అసలు హంగామా అంతా ఆదివారమే కనిపించింది. ఉదయం నుంచే నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లోని మాంసం దుకాణాలు వినియోగదారులతో కిక్కిరిసిపోయి కనిపించాయి. సీతమ్మధార, ఎంఎంటీసీ కాలనీ, బాలయ్య శాస్త్రి లే అవుట్, గురుద్వారా, నక్కవానిపాలెం, గాంధీనగర్, పీ అండ్ టీ కాలనీ, నార్త్ ఎక్స్‌టెన్సన్ ప్రాంతాల్లో గల చికెన్, మటన్ దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. నాటు కోళ్ల విక్రయాలు కూడా జోరుగా జరిగాయి.

కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్లే సాయిబాబా మరణం

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం సాగించిన హింస వల్లే ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణించారని విశాఖ పౌర, ప్రజా సంఘాల నేతలు ఆరోపించారు. ఈ మేరకు ఆశీలమెట్ట జీవీఎంసీ గాంధీ పార్కులో ఆదివారం జరిగిన సాయిబాబా సంతాప సభలో పలువురు వక్తలు మాట్లాడారు. ఢిల్లీ యూనివర్సిటీ పూర్వ ప్రొఫెసర్ సాయిబాబా న్యాయమైన, నూతన సమాజం కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడని వారు కొనియాడారు. సుదీర్ఘమైన జైలు జీవితం వల్లే ఆయన ఆరోగ్యం పాడైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన 90 శాతం దివ్యాంగుడు అయినా బెయిల్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. సాయిబాబా మరణంతో ప్రజలు నిజమైన పోరాట యోధుడిని కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణానికి కేంద్రమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విశాఖ మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జీవీ సత్యనారాయణమూర్తి, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.